సాక్షి
మహబూబాబాద్
శనివారం । 6 । ఏప్రిల్ । 2024



ఆచార్యులు కావలెను
కేయూలోని వివిధ విభాగాల్లో అధ్యాపకుల కొరత ఉంది. పార్ట్‌టైం, కాంట్రాక్ట్ లెక్చరర్లతోనే విద్యాబోధన కొనసాగిస్తున్నారు.
- IIలో▸



గంజాయి పట్టివేత
నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైల్లో అక్రమంగా తరలిస్తున్న 203కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.
- IIలో▸


గరిష్ఠం/కనిష్ఠం
42.2^0 / 23.4^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు స్వల్పంగా వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.



పాత బావులే దిక్కు..

- వాగులు, చెరువులు, వంకలు, ఏరుల్లో నీరు కరువు
- ప్రత్యామ్నాయంగా పాత బావుల పూడికతీత
- పంటలను దక్కించుకునేందుకు రైతుల పాట్లు



సాక్షి, మహబూబాబాద్: జిల్లాలో ఎండలు ముదరడంతో రోజురోజుకూ భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. ఇప్పటికే వాగులు, వంకలు, చెరువులు, ఏర్లు ఎండిపోవడంతో పొలాల పారకం రైతులకు ఇబ్బందిగా మారింది. దీంతో ప్రత్యామ్నాయంగా పడావుగా ఉన్న బావులే దిక్కుగా మారాయి. ఆయా మండలాల్లో బావుల్లో పేరుకుపోయిన పూడికను తీస్తూ పొలాలను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు.



క్రేన్‌తో బావి పూడికతీస్తున్న రైతు ప్రభాకర్ రెడ్డి

ఏటిలో నీళ్లు లేకపోవడంతో..

నర్సింహులపేట మండల కేంద్రానికి చెందిన కొంౖడెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆకేరు సమీపంలో రెండు ఎకరాల్లో వరి, మూడెకరాల్లో బొబ్బెర సాగు శాడు. ఏటిలో నీళ్లు ఉన్నంత వరకు బోరు బాగానే నడిచింది. కానీ వారం రోజులుగా ఏటిలో నీరు లేకపోవడంతో బోరు పోయడం లేదు. చేతికి వచ్చే దశలో పంట ఎండిపోవడాన్ని చూసి తన పాత బావికి క్రేన్ పెట్టి పూడిక తీపిస్తున్నాడు.

పూడిక తీసినా జలధార లేదు..



వెంకన్న పాత బావి పూడిక తీస్తున్న కూలీలు

మహబూబాబాద్ మండలం సోమ్లా తండాకు చెందిన బానోత్ వెంకన్న మూడు ఎకరాల పొలానికి నీరు అందించే బోరు బిక్కిపోయింది. పక్కనే ఉన్న కాల్వ ఎండిపోయింది. దీంతో నీరు అందక పొలం ఎండిపోతోంది. మరో రెండు తడులు నీరు పెడితే పంట చేతికి వస్తుందని భావించిన తరుణంలో తనకున్న పాత బావిపై క్రేన్ పెట్టి పూడిక తీయిస్తున్నాడు. చివరకు పాతబావే దిక్కైందని, దీనిలో కూడా పెద్దగా జలధార లేదని రైతు వెంకన్న చెబుతున్నాడు. పంట పండే పరిస్థితి లేదని వాపోతున్నాడు.

గంటకే ఒడుస్తున్నాయి..



రైతు శ్రీనివాస్ బావిలో పూడికతీత పనులు

కేసముద్రం మండలం కోరుకొండ పల్లి గ్రామానికి చెందిన రైతు బాల్నె శ్రీనివాస్ మూడు ఎకరాల్లో మొక్క జొన్న పంట, అర్ధ ఎకరంలో వరి పంట సాగు చేశాడు. మొక్కజొన్న కంకి వేస్తుండగా, వరి పొట్టదశకు వచ్చింది. ఈ క్రమంలో బావిలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో.. నీళ్లు లేక కళ్లముందే పంటలు ఎండిపోతున్నాయి. చేసేదేమీ లేక క్రేన్ సాయంతో పూడిక తీయిస్తున్నాడు. వచ్చిన కొద్దిపాటి నీళ్లలో మోటార్ పెట్టి పారిస్తే, గంటలోనే నీళ్లు అడుగంటి పోతున్నాయి. మళ్లీ బావిలో నీళ్లు ఊరే వరకు వేచి చూసే పరిస్థితి ఎదురైంది.

పంట పొట్టదశలో పూడిక..



పూడిక తీస్తున్న బానోత్ లింగ్యా బావి

మహబూబాబాద్ మండలం రోటిబండ తండా జీపీ పరిధిలోని దూదియా తండాకుచెందిన బానోత్ లింగ్యా నాలుగు ఎకరాల్లో వరి, ఎకరంలో జొన్న సాగు చేశాడు. ఎస్సారెస్పీ ఆధారంగా సాగు చేయగా, నీరు నిలిచిపోవడంతో పొట్టదశలో ఉన్న పంట ఎండిపోతోంది. దీంతో పంటను కాపాడుకునేందుకు నాలుగు సంవత్సరాల క్రితం వదిలేసిన పాత బావులను రైతు లింగ్యా పూడికతీస్తున్నాడు.

యాసంగి పంట వేసేవాడిని కాదు..



నాగులు ఎకరాల్లో వరి పంట పొట్టదశకు వచ్చింది. సాగర్ నీరు రావడం లేదు. పంట ఎండిపోతుంది. పాత బావులే దిక్కుగా రూ. 30వేలు పెట్టి పూడిక తీస్తున్నాం. ఇటువంటి పరిస్థితి వస్తుందని తెలిస్తే యాసంగి వరి సాగుచేసేవాడిని కాదు.

- బానోత్ లింగ్యా, రైతు, దూదియా తండా

పూడికతీస్తే నీరు వస్తుందని ఆశ

పంటను దక్కించుకునేందుకు ఏకైక ఆధారం బావి. అన్ని నీటి వనరులపై ఆశలు వదులుకొని చివరకు పాతబావిపైనే ఆశలు పెట్టుకున్నాం. రూ. 30వేలు పెట్టి బావిలో పూడిక తీస్తున్నాం. ఇందులో జలం ఉంటుంది. పంటలను బతికించుకోవచ్చనే ఆశతో బావిని తీస్తున్నాం.

- బాల్నె శ్రీనివాస్, రైతు, కోరుకొండపల్లి

కేయూ డిగ్రీ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, పరీక్షల విభాగం అధికారులు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మంలో గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, హానర్స్, ఒకేషనల్ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను కేయూ వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి శుక్రవారం విడుదల చేశారు. డిగ్రీ ఆయా కోర్సుల్లో మొదటి సెమిస్టర్ పరీక్షలో 77,150 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. వారిలో 18,831 మంది (24.41శాతం) ఉత్తీర్ణత సాధించారు. మూడో సెమిస్టర్ పరీక్షలో 59,882 మంది హాజరు కాగా.. 30 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఐదో సెమిస్టర్ పరీక్షల్లో 52,418 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. వారిలో 23,302 మంది (44.45శాతం) ఉత్తీర్ణులయ్యారని కేయూ పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి తెలిపారు. పూర్తి వివరాలు కేయూ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్‌లో చూసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ తిరుమలాదేవి, డాక్టర్ సీహెచ్.రాధిక, సీడీసీ డీన్ ఆచార్య వి.రాంచంద్రం, క్యాంపు ఆఫీసర్లు డాక్టర్ ఆసిం ఇక్బాల్, ఎస్.సమ్మయ్య పాల్గొన్నారు.

తెలంగాణ జనజాతరకు ఆర్టీసీ బస్సులు

హన్మకొండ: హైదరాబాద్ తుక్కుగూడలో శనివారం జరగనున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణ జన జాతరకు ఆర్టీసీ బస్సులను ఆ పార్టీ బుక్ చేసుకుంది. వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల నుంచి 120 బస్సులు జన జాతరకు ఆర్టీసీ అధికారులు కేటాయించారు. కాంగ్రెస్ నాయకులు సూచించిన గ్రామాల నుంచి ప్రజలను ఆర్టీసీ బస్సుల్లో జన జాతరకు తరలిస్తారు.

న్యూస్‌రీల్

కంఠమహేశ్వరుడికి ఎమ్మెల్యే పూజలు



మహబూబాబాద్ రూరల్ : గౌడ కులస్తుల ఆరాధ్యదైవం కంఠమహేశ్వర స్వామి వేడుకలు మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వెన్నం లక్ష్మారెడ్డి, గౌడ కులస్తులు కోల యాదగిరి, సుధాగని మురళీ, నరేష్, దూపటి వినయ్, బత్తిని నర్సయ్య, గీసగాని రంజిత్, గునిగంటి రాజు, దొంతు మహేష్, కోల రాజు, రమేష్, దూపటి వీరన్న, మడత వెంకన్న పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



బయ్యారం: పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బయ్యారంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మౌలానా మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగేలా అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్ టు బిహార్



డోర్నకల్: పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించేందుకు సీఆర్‌పీఎఫ్ బలగాలు పెద్ద సంఖ్యలో బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు తరలివెళ్లాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి బస్సులు, లారీలు, ప్రత్యేక వాహనాల ద్వారా వెయ్యి మందికి పైగా సీఆర్‌పీఎఫ్ పోలీసులు డోర్నకల్ రైల్వే స్టేషన్‌కు చేరుకుని ప్రత్యేక రైలు ద్వారా ఆయా రాష్ట్రాలకు తరలివెళ్లారు. రైల్వే స్టేషన్ ఆవరణలో బస్సులు, లారీలు నిలపగా సీఆర్‌పీఎఫ్ పోలీసులు వీధుల్లో తిరుగుతూ ఆహార పదార్థాలతో పాటు ఇతర వస్తువులు కొనుగోలు చేయడంతో సందడి నెలకొంది.

కాళేశ్వరం దేవస్థానం ఈఓగా మారుతి



కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి దేవస్థానంలో గ్రేడ్–2 ఈఓ ఏ.మారుతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ రెండున్నరేళ్లుగా గ్రేడ్–1 ఈఓగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.మహేష్ జిల్లాలోని రేగొండ మండలం కొడవటంచ లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానానికి బదిలీ అయ్యారు. ఆయన రిలీవ్ కావడంతో మారుతి బాధ్యతలు స్వీకరించారు. కాగా బదిలీ ఉత్తర్వులు వచ్చి నెల గడుస్తున్నా.. ఈఓ కుర్చీపై నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడింది.

అనాథ పిల్లలకు ఆర్థికసాయం

కేసముద్రం: కేసముద్రంవిలేజ్ శివారు చైతన్యనగర్ కాలనీకి చెందిన దుర్గం ధర్మయ్య నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, అతడి భార్య శోభ అగ్నిప్రమాదానికి గురై ఇటీవల మృతి చెందడంతో ఇద్దరు కుమారులు దేవేందర్, అమర్, కూతురు అఖిల అనాథలయ్యారు. ఈ పిల్లల దుస్థితిపై సాక్షి దినపత్రిక కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన డోర్నకల్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి రమేశ్ శుక్రవారం పిల్లలకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. పిల్లల చదువుకు తనవంతుగా సాయం అందిస్తానని హామీ ఇచ్చారు.

జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్, సెల్యూట్ చేస్తున్న ఎస్పీ

మహబూబాబాద్ అర్బన్: భారత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. జగ్జీవన్‌రామ్ 116వ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలోని ఆయన విగ్రహానికి కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, డేవిడ్, జిల్లా అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దళిత కులంలో పుట్టిన జగ్జీవన్‌రామ్ పాఠశాల నుంచి కళాశాల స్థాయి వరకు చురుకైన విద్యార్థిగా రాణించారన్నారు. భారత ఉప ప్రధాని, అనేక పదవులు చేపట్టి దేశానికి ఉత్తమ సేవలందించారన్నారు. విద్యార్థులు, యువత జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మట్లాడుతూ.. దేశ రక్షణ మంత్రిగా జగ్జీవన్‌రామ్ కార్యసాధన ఎప్పటికీ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి బాలరాజు, డీఈఓ రామారావు, డీటీడీఓ ఎర్రయ్య, వాటర్ ఏడీ సురేష్, ఆర్డీఓ అలివేలు, మున్సిపల్ కమిషనర్ రవీందర్, డీఈ ఉపేందర్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రమకృష్ణ, ఉప వైద్యాధికారి అంబరీష, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, వివిధ హాస్టళ్ల వార్డెన్లు, ఉద్యోగస్తులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రాణమున్నంత వరకు కేసీఆర్ వెంటే...

- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

డోర్నకల్: తన గొంతులో ప్రాణమున్నంత వరకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ వెంటే ఉంటానని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ పేర్కొన్నారు. డోర్నకల్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మల్లం రాధిక కుటుంబ సభ్యులను శుక్రవారం ఆమె పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యవతి మాట్లాడుతూ.. తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి మంత్రి పదవి ఇచ్చిన కేసీఆర్ వెంటే తన ప్రయాణం కొనసాగుతుందన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలన రైతులకు స్వర్ణయుగమని, రైతులకు రెండు పంటలకు నీరు, గిట్టుబాటు ధర, మెరుగైన విద్యుత్ సరఫరా లాంటి సదుపాయాలు కల్పించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. డోర్నకల్‌లో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారు పచ్చి అవకాశవాదులని అన్నారు. శనివారం నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే రైతు దీక్షకు రైతులు అధికసంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వార్డు కౌన్సిలర్లు బోరగల్ల శరత్, తేజావత్ సంధ్యారాణి, పోటు జనార్దన్, మార్కెట్ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, నాయకులు మన్యుపాట్ని, పాండు నాయక్, యశోదర్‌జైన్, కొత్త వీరన్న, గౌస్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

కాల్వలు మాయం!

- కబ్జాకు గురవుతున్న ఎస్సారెస్పీ ఉపకాల్వలు
- జిల్లా కేంద్రం సమీపంలో ఆనవాళ్లు కనుమరుగు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

మహబూబాబాద్: జిల్లాలో ఎస్సారెస్పీ కాల్వలు కబ్జాకు గురై ఆనవాళ్లు కోల్పోతున్నాయి. ఉపకాల్వలు, ఫీడర్ కాల్వలు చాలా వరకు కనుమరుగయ్యాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రం, సమీపంలో వ్యవసాయ భూములను వెంచర్లు చేస్తున్న రియల్టర్లు పక్కనే ఉన్న కాల్వలను పూడ్చివేసి ప్లాట్లు చేసి విక్రయాలు జరిపి కోట్లు గడిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే కాల్వలు అన్యాక్రాంతమవుతున్నాయని రైతులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతోనే ఈతంతు జరుగుతోందని వాపోతున్నారు.

మూడు సబ్ డివిజన్లు..
ఇరిగేషన్ శాఖ మానుకోట సర్కిల్ పరిధిలో మూడు సబ్ డివిజన్లు ఉన్నాయి. మానుకోట డివిజన్‌లో మానుకోట, గూడూరు, చిన్నగూడూరు, దంతాలపల్లి మండలాలు ఉన్నాయి. మరిపెడ డివిజన్ పరిధిలో కురవి, మరిపెడ, డోర్నకల్, నర్సింహుల పేట మండలాలు ఉన్నాయి. అలాగే నెక్కొండ డివిజన్ పరిధిలో నెక్కొండ, నెల్లికుదురు, కేసముద్రం మండలాలు ఉన్నాయి. ఆయా సర్కిళ్ల పరిధిలో ఎస్సారెస్పీ స్టేజీవన్ డీబీఎం–48 కాల్వ ఉంది. దీని కింద 1,35,846 ఎకరాల ఆయకట్టు ఉంది. అలాగే డీబీఎం–60 కాల్వ కింద 54,723 ఎకరాల ఆయకట్టు ఉంది. రెండు కాల్వల పరిధిలో 737 చెరువులు ఉండగా 57,757 ఎకరాల ఆయకట్టు ఉందని అధికారులు చెబుతున్నారు. అలాగే 13 లిఫ్ట్ పథకాలు ఉండగా 6,950 ఎకరాల ఆయకట్టు పారకంలో ఉందని అధికారులు చెప్పారు.



మెడికల్ కాలేజీకి వెళ్లే దారిలో 3ఫీట్లకు కుదించిన 26 ఫీట్ల కాల్వ

కబ్జాల పర్వం..
కొన్ని సంవత్సరాల నుంచి ఎస్సారెస్పీ ఉప కాల్వలు కబ్జాకు గురవుతున్నాయి. 75 శాతం ఉప కాల్వలు కబ్జాకు గురికాగా.. ఫీడర్ కాల్వలు పూర్తిస్థాయిలో కనుమరుగయ్యాయి. భూముల ధరలు పెరగడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉపకాల్వలను పూడ్చివేసి ప్లాట్లు చేసి విక్రయాలు చేస్తున్నారు. కురవి, డోర్నకల్, మరిపెడ, మానుకోట మండలాల్లో ఎక్కువగా కబ్జాకు గురయ్యాయి. కాగా కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసిన భూముల్లో ఉన్న కాల్వలను కుదిస్తున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం శివారులోని తాళ్లపూసపల్లి రోడ్డులో ఇటీవల రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వెంచర్ చేయగా వాటి మధ్యలో ఉన్న కాల్వలను పూడ్చివేసి, ప్లాట్లు చేసి విక్రయాలు చేస్తున్నారు. ఇరుగుపొరుగు రైతులకు నచ్చజెప్పి భూ దందాకు పాల్పడుతున్నారు. శనిగపురం రోడ్డులో పలువురు చేసిన వెంచర్లలోని కాల్వలు కూడా పూడ్చివేసి ప్లాట్ల విక్రయాలు జరిపి కోట్లు సంపాదించారు.



తాళ్లపూసపల్లి రోడ్డులో కబ్జాకు గురైన కాల్వ

మేజర్ కాల్వ కుదింపు..
జిల్లా కేంద్రం శివారు ఎస్పీ కార్యాలయం, మెడికల్ కాలేజీ వెళ్లే దారిలో ప్రధాన రహదారి పక్కనే 26ఫీట్ల మేజర్‌కాల్వ ఉండగా.. దానిని 3 ఫీట్లకు కుదించారు. ఈవిషయం తెలుసుకున్న సీపీఐ నాయకులు గత నెల ఆ కాల్వ వద్దనే ఆందోళన చేశారు. రియల్టర్లు కాల్వను కబ్జా చేసి చిన్న కాల్వ (డ్రెయినేజీ కాల్వ మాదిరి)గా మార్చారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుల జోక్యంతోనే కబ్జాలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం

26ఫీట్ల కాల్వ కుదింపు విషయంలో మా ప్రమేయం లేదు. దీనివల్ల రైతులకు నష్టం జరుగుతుంది. ఈ విషయంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం. కాల్వలు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. వ్యవసాయ భూములను కొనుగోలు చేసి కొంత మంది రియల్టర్లు ఉప కాల్వలను పూడ్చి వేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని సందర్శించి చర్యలు తీసుకుని తిరిగి కాల్వలు తీస్తాం.

- కిషోర్‌కుమార్, ఇరిగేషన్ శాఖ డీఈ

చర్యలు తీసుకోవాలి

జిల్లా కేంద్రం శివారులో ఉన్న 26 ఫీట్ల మేజర్ కాల్వను 3 ఫీట్లుగా మార్చిన వారిపై చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో ఇరిగేషన్ అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలి. లేని యెడల్ సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తాం.

-బి.జయ్‌సారథిరెడ్డి, సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్

రాక్..రాసెంగాన్



కాజీపేట అర్బన్: దక్షిణ భారత అతి పెద్ద మూడు రోజుల వసంతోత్సవ వేడుక స్ప్రింగ్‌స్ప్రీ–24 రాసెంగాన్ ఆరంభం అదిరింది. నిట్‌లోని అంబేద్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ లాంఛనంగా జ్యోతిప్రజ్వలన చేసి కల్చరల్ ఫెస్ట్‌ను ప్రారంభించి మాట్లాడారు. సంస్కృతీసంప్రదాయాలను పంచుకునే వేదికగా స్ప్రింగ్‌స్ప్రీ–24ను రాసెంగాన్‌గా నామకరణం చేసి ఏర్పాటు చేశామన్నారు. రాసెంగాన్ అంటేనే అద్భుతాలను ఆవిష్కరించడమని, 40కిపైగా ఈవెంట్లతో ఈ వేడుక నిలుస్తుందన్నారు. కార్యక్రమంలోస్టూడెంట్ వెల్ఫేర్ డీన్ శ్రీనివాసాచార్య, తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు ఉత్సాహంగా విద్యార్థులు..
విద్యార్థులే నిర్వాహకులుగా నిర్వహిస్తున్న స్ప్రింగ్‌స్ప్రీ–24 రాసెంగాన్ తొలిరోజు ట్యాలెంట్ హంట్, ట్రెజర్ హంట్, ఫిల్మ్ క్విజ్ వంటి ఈవెంట్లలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కొరియో నైట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్యం ,ప్రోషోలో చౌరస్తా బ్యాండ్, హరిచరణ్ బ్యాండ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



అట్టహాసంగా నిట్ వసంతోత్సవం షురూ..

- ప్రారంభించిన డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ
- ఆకట్టుకున్న నుక్కడ్ నాటక్.. అలరించిన శాస్త్రీయ నృత్యం
- దుమ్ములేపిన చౌరస్తా, హరిచరణ్ బ్యాండ్
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

ఆకట్టుకున్న నుక్కడ్ నాటక్



నేటి ఆధునిక యుగంలో సమాజంలో చోటు చేసుకుంటున్న అసాంఘిక శక్తులపై స్త్రీ శక్తి తన భద్రకాళీగా ఎదుర్కోవాలనే సందేశాన్ని అందిస్తూ ఆరోహన్ క్లబ్ నుక్కడ్ నాటక్ ప్రదర్శించింది. థియేటర్లలో ప్రదర్శించే ప్రదర్శనలకు దీటుగా నాడు నాటకాలతో సమాజ చైతన్యానికి తోడ్పడిన ప్రదర్శనలను తలపిస్తూ నుక్కడ్ నాటకం నిలిచింది. నాటి తోలు బొమ్మలాట, నిరక్షరాస్యత నిర్మూలన, బాల్యవివాహల నిర్మూలనపై అవగాహన కల్పించారు.

మాట్లాడుతున్న డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ



అలరించిన శాస్త్రీయ నృత్యం...
సంస్కృతీసంప్రదాయలను పరస్పరం పంచుకునేందుకు వేదికగా నిలుస్తున్న స్ప్రింగ్‌స్ప్రీ–24 వసంతోత్సవంలో భారతీయ సంస్కృతిని చాటే కూచిపూడి నృత్యం ప్రత్యేకంగా నిలిచింది. నృత్య గురువు తాడూరి రేణుక బృందం ఆధ్వర్యంలో అంబేద్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో కళాకారులు స్వామీ రారా, శివా శివాయనమహా అంటూ ప్రదర్శన ఇచ్చారు. రేణుకను నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ సన్మానించారు.

ప్రోషోలో బ్యాండ్ బజావో..
ప్రోషోలో చౌరస్తా బ్యాండ్, హరిచరణ్ బ్యాండ్‌లు తమ గీతాలాపన, వాయిద్య బృందంతో రాక్ అనిపించింది. ఆటలు, పాటలతో బ్యాండ్ బజావో బ్యాండ్ అంటూ అలరించారు. వీరి ప్రదర్శనలకు విద్యార్థులు ఉర్రూతలూగారు.

క్లుప్తంగా

నేడు వీఎంఎఫ్ ప్రవేశ పరీక్ష

తొర్రూరు: ఉమ్మడి వరంగల్, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే తొమ్మిదో తరగతి విద్యార్థులకు వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు (శనివారం) తొర్రూరులో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు వీఎంఎఫ్ డైరెక్టర్ తక్కెళ్లపల్లి రవీంద్ర తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో 10 జీపీఏ సాధించడం, ఇతర సబ్జెక్టుల్లో పట్టు సాధించడంపై వీఎంఎఫ్ ఆధ్వర్యంలో తొర్రూరులోని నితిన్ భవన్‌లో ఈ నెల 23 నుంచి 31రోజుల పాటు ఉచిత శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రవేశ పరీక్ష నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు ఉచిత భోజనం, వసతితో కూడిన శిక్షణ అందిస్తామని తెలిపారు. నేడు ఉదయం 11గంటలకు తొర్రూరులోని నితిన్ భవన్‌లో ప్రవేశపరీక్ష ఉంటుందని, తొమ్మిదో తరగతి పాఠ్యాంశాలపై ప్రశ్నలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు నేడు ఉదయం 10గంటలకు తొర్రూరులోని నితిన్ భవన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు 91771 48158, 97041 90459 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

వడదెబ్బతో ఒకరి మృతి


మంచ్యా (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని సికింద్రాబాద్ తండా గ్రామానికి చెందిన ధరావత్ మంచ్యా (55) వడదెబ్బకు గురై శుక్రవారం మృతిచెందాడు. గ్రామంలో కిరాణం షాపు నిర్వహించే మంచ్యా.. సామగ్రి కోసం జిల్లా కేంద్రానికి వచ్చి తన పనులు పూర్తి అయ్యాక ఇంటికి వెళ్లాడు. ఎండలో వచ్చి తనకు ఆయాసం వస్తుందని కుటుంబ సభ్యులతో చెప్పిన మంచ్యా.. కొంత సమయం తర్వాత మంచి నీళ్లుతాగి ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయి మృతిచెందాడు. మంచ్యాకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వెంకటాద్రిపేటలో జయపాల్‌రెడ్డి..


జయపాల్‌రెడ్డి (ఫైల్)

చిల్పూరు: మండలంలోని వెంకటాద్రిపేట గ్రామానికి చెందిన గాదె జయపాల్‌రెడ్డి (55) గురువారం వడదెబ్బకు గురికాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు అందించిన వివరాలు.. రోజు మాదిరిగానే గురువారం వ్యవసాయ బావివద్దకు వెళ్లి వచ్చి కింద పడి పోగా కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అంతకుముందు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జయపాల్‌రెడ్డిని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించారు.

ఆచార్యులు కావలెను

కేయూలో 326 అధ్యాపక పోస్టుల ఖాళీ
- రెగ్యులర్ అధ్యాపకులు 83మంది మాత్రమే..
- 14 ఏళ్లుగా లేని నియామకాలు
- అకడమిక్ సెనెట్‌లో ఆందోళన వెలిబుచ్చిన సభ్యులు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఒకప్పుడు రెగ్యులర్ అధ్యాపకులు ఎక్కువమంది ఉండి బోధన, పరిశోధనలపరంగా ఎంతో పేరుండేది. యూనివర్సిటీలో సీనియర్ ఆచార్యుల ఉద్యోగ విరమణలతో క్రమంగా యూనివర్సిటీ ప్రాభవం కోల్పోతూ దయనీయ స్థితిలోకి నెట్టివేయబడుతోంది. ఉత్తర తెలంగాణాలోనే ఎంతో ప్రతిష్ఠాత్మకమైన వర్సిటీగా ప్రస్తుతం న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ కలిగినప్పటికీ అడ్మిషన్లు పరీక్షలు మధ్యలో బోధన అంతంత మాత్రమే ఉందనడంలో అతిశయోక్తిలేదు.

326 అధ్యాపక పోస్టుల ఖాళీ

కేయూలో మూడు కేటగిరీలు కలిపి (అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్) 409 పోస్టుల మంజూరీ ఉండగా.. ప్రస్తుతం 83 మంది రెగ్యులర్ అధ్యాపకులు పనిచేస్తున్నారు. 326 పోస్టులు వేకన్సీలుగా ఉన్నాయి. 14ఏళ్లుగా అధ్యాపకుల పోస్టుల భర్తీలేదు. 2017లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 136 అధ్యాపకుల పోస్టులను మంజూరు చేసినప్పటికీ నేటికీ భర్తీ ప్రక్రియ చేపట్టలేదు. కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డుతోనే చేపడతామని చెప్పిన అప్పటి ప్రభుత్వం ఆ ప్రక్రియను చేపట్టలేకపోయింది.

అకడమిక్ సెనెట్‌లో ఆందోళన..

కేయూలో ఇటీవల 39వ అకాడమిక్ సెనెట్‌లో పలువురుసభ్యులు మాట్లాడుతూ గత ప్రభుత్వం యూనివర్సిటీలపై నిర్లక్ష్యం వహించిందని రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవటంతో విద్యాబోధన, పరిశోధనలపరంగా ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేయూకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించవచ్చు కాని రెగ్యులర్ అధ్యాపకుల పోస్టుల భర్తీ జరగాలని ఆకాంక్షించారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పోస్టుల భర్తీపై దృష్టిసారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం పడ్డారు.

అభద్రతాభావంలో అధ్యాపకులు

వర్సిటీలో 2010లో వివిధ విభాగాల్లో నియమితులైన అధ్యాపకులు అభద్రతాభావంలో ఉన్నారు. వారి నియామకాలపై కొన్నేళ్లుగా వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఉద్యోగం నుంచి తొలగించిన విషయం విధితమే. ఆ తర్వాత పరిణామక్రమం నేపథ్యంలో ఉద్యోగం రాని ఇద్దరు అభ్యర్థులు వేసిన కంటెప్ట్ కేసు కూడా హైకోర్టులో కొనసాగుతోంది. మరోవైపు యూనివర్సిటీ అధికారులు ఆయా అధ్యాపకులకు పదోన్నతులు ఇవ్వకపోవటంతో వారు ఆవేదనలో ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా భర్తీకి నోచుకునేనా

బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లలో నియామకాలేవు. ఇప్పుడు కొత్తగా వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి యూనివర్సిటీలపై దృష్టిసారిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాతనైనా యూనివర్సిటీల్లోని సమస్యల పరిష్కారంతోపాటుగా అధ్యాపక ఖాళీలను భర్తీచేస్తారా.. లేదా.. వేచి చూడాల్సిందే.

కాంట్రాక్టు, పార్ట్‌టైం లెక్చరర్లతోనే..

వర్సిటీ పరిధిలో వివిధ విభాగాల్లో పార్ట్‌టైం, కాంట్రాక్టు లెక్చరర్లతోనే విద్యాబోధన కొనసాగుతోంది. కాంట్రాక్టు లెక్చరర్లు 181మంది పనిచేస్తుండగా.. పార్ట్‌టైం లెక్చరర్లు 206మంది పనిచేస్తున్నారు.
- రెండు విభాగాల్లో అసలే అధ్యాపకులేకపోవడం గమనార్హం.
- రెండు విభాగాల్లో రెగ్యులర్ ప్రొఫెసర్లు లేరు..
- విద్యావిభాగంలో ప్రిన్సిపాల్‌గా కాంట్రాక్టు లెక్చరర్ విధులను నిర్వర్తిస్తుండా మిగితా 15మంది వరకు గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారు.
- బీఈడీ, ఎంఈడీ కోర్సులు ఎత్తివేసే పరిస్థితిలో గెస్ట్ లెక్చరర్లను నియమించటంతో ఆ కోర్సులు గట్టెక్కాయి. విద్యావిభాగం డీన్‌గా కూడా రిటైర్డ్ ప్రొఫెసర్‌కు బాధ్యతలు అప్పగించారు.
- ఎంఏ పొలిటికల్ సైన్స్ విభాగంలో అసలే రెగ్యులర్ అధ్యాపకులు లేరు. ఇటీవల ఆవిభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా కూడా కాంట్రాక్టు లెక్చరర్‌నే నియమించారు.
- ఎమ్మెస్సీ సైకాలజీ, ఎంసీజే లాంటి కోర్సుల్లోను ఒక్కరు కూడా రెగ్యులర్ అధ్యాపకులు లేరు.
- ఎంఏ తెలుగు, ఎంఏ హిస్టరీ, ఎంఏ ఎకనామిక్స్, ఎంఎల్ఐఎస్సీకి ఒక్కొక్కరు చొప్పున మాత్రమే రెగ్యులర్ అధ్యాపకులు ఉన్నారు.
- బాటనీ విభాగంలో ఇద్దరు ప్రొఫెసర్లు మాత్రమే ఉన్నారు. ఆవిభాగం అధిపతీ కాంట్రాక్టు లెక్చరరే..
- కేయూ పరిధిలోని మహబూబాబాద్, భూపాలపల్లి, జనగామ జిల్లా కేంద్రాల్లోని పీజీ సెంటర్లలో కూడా ఒక్కరు రెగ్యులర్ అధ్యాపకులు లేరు.
- కేయూ పరిధిలోని ఖమ్మం పీజీ సెంటర్ ప్రిన్సిపాల్‌గా కూడా కాంట్రాక్టు అధ్యాపకుడికే బాధ్యతలు అప్పగించారు.
- దూరవిద్యాకేంద్రం(ఎస్‌డీఎల్‌సీఈ)లో ఒక్కరే రెగ్యులర్ ప్రొఫెసర్ ఉన్నారు.



విభాగాల వారీగా ఖాళీల జాబితా..

విభాగం	ఖాళీలు
బాటనీ	19
బయోటెక్నాలజీ	02
బిజినెస్ మేనేజ్‌మెంట్	05
కెమిస్ట్రీ	19
5ఏళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ	09
సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ సెంటర్	04
కామర్స్	28
ఎకనామిక్స్	21
ఎడ్యుకేషన్	04
ఇంజనీరింగ్ ఫర్ యూసీఈ	13
ఇంజనీరింగ్ కేయూ సీఈఅండ్‌టీ	34
ఇంగ్లిష్	21
జియాలజీ	11
హిందీ	05
హిస్టరీ	08
కంప్యూటర్ సైన్స్	02
లా కాలేజీలో	04
లైబ్రరీ సైన్స్	01
మ్యాథ్‌మెటిక్స్, స్టాటిస్టిక్స్	10
మైక్రోబయాలజీ	01
ఫార్మసీ	15
ఫిజికల్ ఎడ్యుకేషన్	03
ఫిజిక్స్	14
పొలిటికల్ సైన్స్	08
పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్	16
సంస్కృతం	01
సోషియాలజీ	04
జువాలజీ	17
తెలుగు	11
ఉర్దూ	02
ఎస్‌డీఎల్‌సీఈ	14
	326

బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య


సౌమ్య(ఫైల్)

గీసుకొండ: మండలంలోని కొనాయమాకుల గ్రామానికి చెందిన బీఫార్మసీ విద్యార్థిని కాందారి సౌమ్య(20) గత కొంతకాలంగా మైగ్రేన్‌తో బాధపడుతూ ఆత్మహత్యకు పాల్పడింది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొనాయమాకులకు చెందిన కాందారి శంకర్‌రావు కూతురు సౌమ్య వరంగల్ నగరంలోని తాళ్ల పద్మావతి కాలేజీలో బీ ఫార్మసీ చదువుతూ హాస్టల్‌లో ఉంటుంది. ఈక్రమంలో ఆమె మైగ్రేన్‌తో బాధపడుతూ నొప్పి తీవ్రం కావడంతో ఈ నెల 2న తండ్రికి ఫోన్ చేసి ఇంటికి వచ్చింది. నొప్పి మరింత తీవ్రం కావడంతో ఈ నెల 3న ఇంటివద్దే గడ్డిమందు తాగటంతో ముందుగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి, ఆ తర్వాత పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శరీరం ఇన్‌ఫెక్షన్ కావడంతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ వెల్లడించారు.

అప్పులబాధతో యువకుడు..


కృష్ణ(ఫైల్)

నర్మెట: అప్పుల బాధతో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కన్నెబోయిన గూడెంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా నర్మెట మండలం కన్నెబోయిన గూడెం గ్రామానికి చెందిన గంగరబోయిన కృష్ణ (25) సెకండ్ హ్యాండ్ కార్ల క్రయ విక్రయాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో వ్యాపారం కలిసిరాక అప్పుల పాలై కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో కుటుంబంలో కలహాలు చోటు చేసుకున్నాయి. ఈక్రమంలో ఈనెల 2న భార్యాభర్తల మధ్యవివాదం చోటు చేసుకోవడంతో కృష్ణ పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య రవళి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్ల ఎస్సై కన్నెబోయిన శ్రీకాంత్ తెలిపారు.

సమాజంపై యువతకు అవగాహన అవసరం

- హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్


సభలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

కేయూ క్యాంపస్: సమాజంపై యువతకు అవగాహన అవసరం అని హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ అన్నారు. కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా పరిపాలనాభవనంలోని సెనెట్‌హాల్‌లో కాంటెంపరరీ ఇష్యూస్ ఆఫ్ ఇండియన్ సొసైటీ అనే అంశంపై ఆయన కీలకోపన్యాసం చేశారు. దేశంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం పెరిగిందన్నారు. ముఖ్యంగా గ్రామీణ యువత చదువు మధ్యలోనే ఆపివేస్తున్నారన్నారు. జీవన ప్రమాణాలు, జీవన సౌకర్యాలకు స్థూల జాతీయ, దేశీయ ఉత్పత్తి తలసరి ఆదాయం ఇతర గణాంకాలతో పొంతనలేదన్నారు. దేశంలో ఎక్కువ మొత్తంలో పేదరికం, దారిద్ర్యరేఖకు దిగువనే ఉన్నారన్నారు. సంక్షేమపథకాలు సరిగా అందడంలేదని అభిప్రాయపడ్డారు. రూ.80లక్షల కోట్ల నల్లధనం ఉందన్నారు. కొద్ది మంది చేతుల్లోనే సంపద కేంద్రీకృతం అయిందని తెలిపారు. కొన్నిచట్టాలు కూడా లోపభూయిష్టంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్, పూలే వంటి వారి త్యాగాల వలన నేడు కొంతవివక్ష వీడిందన్నారు. కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్, కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ రాజమణి, ఇంజనీరింగ్ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకురాలు డాక్టర్ లక్ష్మి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ పృథ్వీరాజ్, హాస్టల్ జాయింట్ డైరెక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడారు. తొలుత కేయూలోని దూరవిద్యా కేంద్రం ఆవరణలో ఉన్న జగ్జీవనారామ్ విగ్రహానికి జస్టిస్ చంద్రకుమార్, వీసీ, రిజిస్ట్రార్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రైలులో 2.3 క్వింటాళ్ల గంజాయి పట్టివేత

- మార్కెట్ విలువ సుమారు రూ.50లక్షలు
- ఇద్దరి నిందితుల అరెస్టు


గంజాయిని చూపుతున్న వరంగల్ ఆర్పీఎఫ్, జీఆర్పీ సీఐలు టీఎస్ఆర్ కృష్ణ, నరేష్, సిబ్బంది

కాశిబుగ్గ: చెన్నై సెంట్రల్ నుంచి అహ్మదాబాద్ జంక్షన్‌కు వెళ్లే నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైల్లో అక్రమంగా తరలిస్తున్న 203.400కిలోల గంజాయిని వరంగల్ రైల్వే పోలీసులు గురువారం రాత్రి పట్టుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల కోడ్ తనిఖీలో భాగంగా ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది మహబూబాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైల్లో తనిఖీలు చేస్తున్నారు. ఈక్రమంలో జనరల్ బోగిలో ఇద్దరు మహిళలు(అత్త కోడలు) తాము కూర్చున్న సీట్ల కింద 10ప్లాస్టిక్ బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించారు. వారిని వరంగల్ రైల్వే స్టేషన్‌లో దించి బ్యాగులను తనిఖీ చేయగా 96ప్యాకెట్లలో 203.400కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను స్టేషన్‌కు తరలించి విచారించామన్నారు. విచారణలో మహారాష్ట్ర, యావల్, జల్గావ్ సకాలీకి చెందిన చందాబాయి భీమా బెల్దార్ (62), ఉషా దిలీప్ చవాన్(43) అత్తా కోడళ్లు వీరు గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు తేలిందని తెలిపారు. ఈనేపథ్యంలో విజయవాడ నుంచి జల్గావ్‌కు వారు గంజాయి రవాణా చేస్తున్నట్లుగా అంగీకరించినట్లు తెలిపారు. ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్‌కె సుభాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరి నిందితును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని సీఐ నరేష్ తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో ఈ గంజాయి విలువ సుమారు రూ.50,85,000 ఉంటుందని తెలిపారు. వరంగల్ రైల్వే స్టేషన్ పరిధిలో ఇంతభారీమొత్తంలో గంజాయి పట్టుకోవడం ఇదే మొదటిసారి అని సీఐ తెలిపారు.

ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి


రాజయ్య మృతదేహం

చిట్యాల: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని జూకల్ గ్రామానికి చెందిన కుర్మిళ్ల రాజయ్య(56) శుక్రవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన కురిమిళ్ల రాజయ్య, కురిమిళ్ల శంకర్, సాయిరెడ్డి తమ వ్యక్తిగత పని మీద చల్లగరిగకు వెళ్లి బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో చర్చి వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో రాజయ్య తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనంపై వెనుక ఉన్న శంకర్, సాయిరెడ్డి గాయపడగా.. సివిల్ ఆస్పత్రికి తరలించారు. మృతిడికి భార్య భాగ్యమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

- విద్యార్థి మృతి, మరో విద్యార్థికి తీవ్ర గాయాలు


రాకేష్ (ఫైల్)

హసన్‌పర్తి: గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఓ విద్యార్థి మృతి చెందగా, మరో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిలోని ఎస్సార్ యూనివర్సిటీ సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున ప్రమాదం జరిగింది. ఈమేరకు మృతుడి తండ్రి బుర్రి చేరాలు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా ఆరెపల్లికి చెందిన బుర్రి రాకేష్(24) డిగ్రీ పూర్తి చేసి, ఉన్నత విద్యభ్యసం కోసం ప్రైవేట్‌గా శిక్షణ పొందుతున్నాడు. గురువారం ఎల్కతుర్తిలోని తమ సమీప బంధువుల పెళ్లికి హాజరయ్యాడు. తమ బంధువు కౌశిక్‌తో కలిసి బైక్‌పై ఆరెపల్లికి వచ్చారు. శుక్రవారం తెల్లవారు జాము ఇద్దరు కలిసి బైక్‌పై ఎల్కతుర్తికి బయల్దేరారు. అయితే ఎస్సార్ యూనివర్సిటీ సమీపంలో వెనుక వైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈప్రమాదంలో రాకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై అశోక్ సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కౌశిక్‌ను అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కౌశిక్ పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.

జగ్జీవన్‌రామ్ గొప్ప రాజనీతిజ్ఞుడు


జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న వరుణ్ రెడ్డి

హన్మకొండ: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, గొప్ప రాజనీతిజ్ఞుడు, పరిపాలనా దక్షుడని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా జగ్జీవన్ రామ్ చిత్రపటానికి సీఎండీ వరుణ్‌రెడ్డి, డైరెక్టర్లు, అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలచేత అప్యాయంగా బాబుజీ అని పిలిపించుకున్న మహా నాయకుడని కొనియాడారు. డైరెక్టర్ అశోక్ కుమార్, తిరుపతిరెడ్డి, ఛీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జనార్దన్, సీజీఎంలు టి.మధుసూదన్, కిషన్, రాజుచౌహాన్, ప్రభాకర్, అశోక్, కె.ఎస్. గుట్ట, రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరీ రమేష్, కంపెనీ కార్యదర్శి వెంకటేశం, జీఎంలు అన్నపూర్ణ, బీకంసింగ్, దేవేందర్, వేణుబాబు, మాధవరావు, సత్యనారాయణ ఉన్నారు.

కాంగ్రెస్ సామాజిక న్యాయాన్ని విస్మరిస్తున్నది

- బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేశ్


సమావేశంలో మాట్లాడుతున్న దాసు సురేశ్

రామన్నపేట : బీసీ దళిత మైనార్టీ ఉద్యమకారులు, మేధావులు, నిరుద్యోగులు, ప్రజాస్వామిక శక్తుల మద్దతుతోనే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన విషయాన్ని కాంగ్రెస్ విస్మరిస్తున్నదని బీసీ రాజ్యాధికారి సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ పేర్కొన్నారు. శుక్రవారం ములుగు రోడ్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాంచ్ న్యాయ్‌పేరిట మేనిఫెస్టో విడుదల చేస్తున్న కాంగ్రెస్.. రాష్ట్రంలో సామాజిక న్యాయాన్ని విస్మరించడం విడ్డూరంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలన్నీ సామాజిక న్యాయం పాటించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ పెండింగ్‌లో ఉన్న ఖమ్మం, కరీంనగర్ స్థానాలను బీసీలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి పొలిటికల్ వ్యవహారల కమిటీ చైర్మన్ తులసి శ్రీమాన్, డాక్టర్ శ్రీనివాస్ వర్మ, రావుల జగదీశ్వర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు జాబితా అందజేత


వరంగల్: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ తుది ఓటరు జాబితాను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. శుక్రవారం ఏనుమాముల మార్కెట్ యార్డ్ గోడౌన్‌లో ర్యాండమైజేషన్ చేయబడిన ఈవీఎంల కేటాయింపు సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వరంగల్ జిల్లా పట్టభద్రుల తుది ఓటర్ల జాబితాను అదనపు కలెక్టరేట్ సంధ్యారాణి అందజేశారు. హనుమకొండ జిల్లాలో 43,594 మంది పట్టభద్రులైన ఓటర్లు ఉన్నారని అడిషనల్ కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల పర్యవేక్షకుడు విశ్వనారాయణ, అనిల్‌కుమార్, దాసరి రాజేష్, లక్ష్మణ్, బాబురావు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ


స్వామికి పూజలు నిర్వహిస్తున్న శశాంక్ గోయల్

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయల్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వల్మిడి శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయానికి చేరుకున్నారు. పూజల తర్వాత అర్చకులు స్వామివారి శేష వస్త్రాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్మార్ పింకేష్‌కుమార్, ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ వెంకటేశం పాల్గొన్నారు.

మానవతాదృక్పథంతో వైద్యం అందించాలి


మాట్లాడుతున్న కస్తూరి శ్రీధర్


పట్టాల ప్రదానోత్సవంలో విద్యార్థుల సందడి

- సాంకేతిక వైద్యవిద్య వైపు పరుగులు పెట్టాలి
- కేఎంసీ పూర్వ విద్యార్థి, డాక్టర్ కస్తూరి శ్రీధర్
- కేఎంసీలో పట్టాల ప్రదానోత్సవం

ఎంజీఎం : మానవతాదృక్పథంతో ప్రజలకు వైద్యం అందించాలని కేఎంసీ పూర్వ విద్యార్థి, ప్రముఖ కార్డియాలజిస్టు కస్తూరి శ్రీధర్ అన్నారు. శుక్రవారం రాత్రి కేఎంసీ కళాశాల మైదానంలో మెడిసిన్ వైద్య విద్యను పూర్తి చేసిన విద్యార్థుల పట్టాల ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ.. సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణం వైద్యవిద్యలో వస్తున్న నూతన అంశాలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని సూచించారు. వైద్య వృత్తిలో మానవత్వాన్ని మరిచిపోకూడదని పేదప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్‌రాంకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా కేఎంసీ ప్రాంగణం..

పట్టాల ప్రదానోత్సవంతో కళాశాల మైదానం కోలాహలంగా మారింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున తరలిరావడంతో వైద్యవిద్యను పూర్తి చేసుకుని పట్టాలు అందుకుంటున్న సందర్భంలో విద్యార్థులు వారి బంధువులతో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


పట్టా అందుకుంటున్న వైద్య విద్యార్థిని




కుటుంబ సభ్యులతో పట్టభద్రులు

ఆరోగ్యానికి 6 రుచులు



త్వరలో ఉగాది వస్తోంది. ఆరు రుచులున్న ఉగాది పచ్చడిని ఈ రోజు తప్పనిసరిగా సేవించడం ఈ పండగ ఆచారం. ఉగాది రోజున షడ్రుచుల సమ్మేళనం అయిన ఉగాది పచ్చడి సేవిస్తే ఆయా రుచుల్లాగే సంవత్సరమంతా మనకు ఆయా ఫలాలు అందుతాయని, అలా రకరకాల అనుభవాలూ, అనుభూతులను ఆస్వాదించడమే జీవితమని పెద్దలు చెబుతారు. అయితే అలా కేవలం ఉగాది నాడు మాత్రమే కాదు, వీలయితే ప్రతిరోజూ ఆరు రుచుల ఆహారాలను తీసుకోవడం వల్ల మనం ఆరోగ్యంగా ఉండచ్చని ఆయుర్వేదం చెబుతోంది. ఏయే రుచులు ఉన్న ఆహారాలను తీసుకోవడం వల్ల మనకు ఎలాంటి లాభాలు కలుగుతాయో తెలుసుకుందాం.




1.తీపి

శరీరంలోని వాత, పిత్త దోషాలను ఈ రుచి సమం చేస్తుంది. తీపి పదార్థాలను తీసుకోవడం వల్ల ఆయుర్దాయం పెరుగుతుంది, శరీరం దృఢంగా మారుతుంది. శక్తి అందుతుంది. శరీరంలో ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. అయితే వీటిని చాలా తక్కువగా తినాలి. లేదంటే శరీరంలో కఫ దోషం పెరుగుతుంది. ఫలితంగా అధిక బరువు, స్థూలకాయం, డయాబెటిస్ వంటి వ్యాధులు వస్తాయి. కనుక ఈ రుచి ఉన్న ఆహారాలను నిత్యం తక్కువ మోతాదులో తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చు.



2.పులుపు

వాత దోషాలను పులుపు తగ్గిస్తుంది. పులుపు రుచి ఉన్న ఆహారాలను తినడం వల్ల ఆకలి పెరుగుతుంది. జీర్ణ సమస్యలు ఉండవు. నిమ్మ, చింతకాయ వంటి పులుపు ఉన్న ఆహారాలను నిత్యం పరిమితంగా తీసుకోవచ్చు. అయితే ఎక్కువగా తీసుకుంటే పిత్త, కఫ దోషాలు పెరుగుతాయి. కనక పులుపు ఆహారాలను కూడా తక్కువగా తీసుకోవాలి.



3.ఉప్పు

ఉప్పు ఉన్న ఆహారాలను తీసుకోవడం వల్ల వాత దోషం తగ్గుతుంది. ఉప్పు అధికమైతే పిత్త, కఫ దోషాలు పెరుగుతాయి. ఉప్పు ఉన్న ఆహారాల వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది. కణాలు శుభ్రమవుతాయి. ఉప్పు ఉన్న పదార్థాలను కూడా తక్కువగా తీసుకోవాలి. ఎక్కువైతే బీపీ పెరుగుతుంది. గుండె జబ్బులు వస్తాయి.



4.కారం

కారపు రుచి గల ఆహారాలను తీసుకుంటే జీర్ణశక్తి పెరుగుతుంది. ఆకలి వేస్తుంది. కణాలు శుభ్రమవుతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. కఫ దోషం తగ్గుతుంది. కారం ఎక్కువైతే పిత్తదోషం పెరుగుతుంది. అందువల్ల కారాన్ని నిత్యం తక్కువగానే తీసుకోవాలి.



5.చేదు

చేదుగా ఉన్న పదార్థాలను తినడం వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. పిత్త, కఫ దోషాలు తగ్గుతాయి. చేదుగా ఉన్న పదార్థాలను నిత్యం కొద్దిగా ఎక్కువ మోతాదులో తీసుకున్నా పెద్దగా సమస్యలు ఉత్పన్నం కావు.

6.వగరు

వగరు ఉన్న పదార్థాలను కూడా నిత్యం తినాలి. కానీ వీటిని తక్కువగా తీసుకోవాలి. లేదంటే జీర్ణాశయంలో గ్యాస్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఇక పిత్త దోషం ఉన్న వారికి ఈ రుచి ఉన్న పదార్థాలు ఎంతగానో మేలు చేస్తాయి. పచ్చి అరటి పండ్లు, క్రాన్‌బెర్రీలు, గ్రీన్ బీన్స్ వంటివి ఈ రుచి ఉన్న పదార్థాలకు ఉదాహరణలుగా చెప్పవచ్చు.

అయితే భోజనం చేసేటప్పుడు ఒకేసారి ఆరు రుచులు కలిసిన పదార్థాలను తినాల్సిన పనిలేదు. రోజులో మొత్తంగా చూసుకుంటే ఈ ఆరు రుచులు ఉన్న పదార్థాలను తిన్నామా లేదో అని చెక్ చేసుకుంటే చాలు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజనాల్లో ఈ ఆరు రుచుల నుంచి ఏవైనా రెండు రుచులు కలిగిన ఆహారాలను ఎంచుకుని తింటే చాలు. అంటే ఉదయం చేదు, కారం, మధ్యాహ్నం తీపి, వగరు, రాత్రి పులుపు, ఉప్పు.. ఇలా రెండేసి రుచులు ఉండేలా ఆహారాలను తీసుకుంటే చాలు. ఇవే తినాలని ఏమీ లేదు. ఎవరికి నచ్చినట్లు వారు ఆహారాలను ఎంచుకుని ఆరు రుచులు కవర్ అయ్యేలా చూసుకుంటే చాలు.

హెల్త్ టిప్స్


- రోజూ కప్పు నల్ల ద్రాక్ష రసం తీసుకుంటే గుండెపోటుకు దూరంగా ఉండవచ్చు.
- పడుకునేటప్పుడు ఎడమ పక్కకు తిరిగి పడుకుంటే ఎసిడిటీ రాదు.
- 10 తులసి ఆకుల రసం ఒక కప్పు చొప్పున రెండు పూటలా తీసుకుంటే చర్మ వ్యాధులు, రాషెస్ కు సంబంధించి వెంటనే ఫలితం కనిపిస్తుంది.
- రెండు స్పూన్లు ఉసిరి రసం, తేనెను అర కప్పు నీటిలో బాగా కలిపి 3 పూటలా సేవిస్తే బీపీ తగ్గుముఖం పడుతుంది.

మీకు తెలుసా?

'రోజు ఒక కప్పు ఉడకబెట్టిన శనగలు తింటే...

- గుండె జబ్బులు దరిచేరవు.
- రోజంతా ఉత్సాహంగా ఉంటారు.
- కాలేయం సమస్యల నుంచి త్వరగా కోలుకుంటారు.
- ఒత్తిడి, ఆందోళన దూరం అవుతాయి.
- జీర్ణ సమస్యలు తగ్గుతాయి.
- ఎముకలు దృఢంగా మారుతాయి.
- రక్త సరఫరా మెరుగుపడి బీపీ అదుపులో ఉంటుంది.

వేసవి తాపానికి కర్బూజ పండు



వేసవిలో మనకు విరివిగా దొరికే పండు కర్బూజ. ఈ పండులో అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి. కర్బూజ పండులో దాదాపు తొంభై శాతం నీరు ఉంటుంది. కాబట్టి వేసవి తాపాన్ని తగ్గించుకోవడానికి, వేసవిలో శరీరం కోల్పోయే నీటి శాతాన్ని భర్తీ చేయడానికి కర్బూజ పండు బాగా ఉపయోగపడుతుంది. కర్బూజ ముఖ్యంగా శరీరంలోని వేడిని, అధిక రక్తపోటుని తగ్గిస్తుంది. ఈ పండులో ఉన్న పోషక విలువలేంటో తెలుసుకుందాం.

- కర్బూజ పండులో ఎక్కువ శాతం ఉండే బీటాకెరోటిన్ క్యాన్సర్‌కు దారితీసే ఫ్రీ-రాడికల్స్‌ని తొలగిస్తుంది. దీనిలో ఉన్న విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచడంతోపాటు శరీరంలో తెల్ల రక్త కణాలు వృద్ధి చెందేలా చేసి రక్తంలో ఇన్ఫెక్షన్ రాకుండా కాపాడుతుంది.
- కర్బూజ లో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఇది కంటి సంబంధిత సమస్యలను దూరం చేసి కంటిచూపు బాగా ఉండేలా చేస్తుంది. వడదెబ్బ నుండి రక్షిస్తుంది.
- కర్బూజ పండులో విటమిన్ కె, విటమిన్ ఇ సమృద్ధిగా ఉంటాయి. దీనివల్ల ప్రత్యుత్పత్తి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. అంతేకాకుండా రక్త ప్రసరణ చక్కగా జరిగేలా ఉపయోగపడుతుంది.
- కర్బూజలో అధిక మోతాదులో ఉండే పొటాషియం గుండెకు మంచి న్యూట్రియన్స్‌ని అందజేస్తుంది. దీనిలో ఫోలేట్ ఉండటం వలన అది హార్ట్ ఎటాక్ నుండి మరియు గుండె జబ్బుల నుండి కాపాడుతుంది.
- ఖర్బూజలో తక్కువ క్యాలరీస్ కలిగి ఎక్కువగా పీచు పదార్థం ఉండటం వలన అధిక బరువుని తగ్గిస్తుంది.
- కర్బూజ రసం తాగడం వల్ల మెదడుకి ఆక్సిజన్ సరఫరా బాగా జరిగి, ఒత్తిడి తగ్గి నిద్ర బాగా పడుతుంది. ఈ జ్యూస్‌ని క్రమం తప్పకుండా సేవిస్తే రక్తంలోని చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది.
- ఈ పండు కిడ్నీలో రాళ్లను సైతం కరిగిస్తుంది. జీర్ణశక్తిని మెరుగు పరుస్తుంది. ఈ పండులో ఫోలిక్ యాసిడ్ సమృద్ధిగా ఉండడం వలన గర్భిణులకు ఎంతో మేలు చేస్తుంది. బిడ్డ ఎదుగుదలకు బాగా తోడ్పడుతుంది.
- కంటి ఆరోగ్యాన్ని మెరుగు పరచడానికి, శ్లేష్మాన్ని తగ్గించడానికి కర్బూజా సహాయపడుతుంది.

వేసవిలో కర్బూజ పండు ముక్కలతో పాటు జ్యూస్ తాగటం వల్ల మెరుగైన ఆరోగ్యం పొందవచ్చు.





ముందే జాగ్రత్త పడదాం...

ఇంకా ఏప్రిల్ మొదటివారంలోనే ఉన్నాం. అప్పుడే ఎండలు మండిపోతున్నాయి. వివిధ వృత్తి ఉద్యోగ వ్యాపారాల రీత్యా రోజూ ఎండలోకి వెళ్లక తప్పనివారిని వేధించే సమస్య వడదెబ్బ. ఈ నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆరోగ్య నిపుణులు, అనుభవజ్ఞులు చెప్పిన చిట్కాలు కొన్ని...

ముందు జాగ్రత్తలు

ఎండల ధాటికి వడదెబ్బ ప్రభావం శరీరంపై పడే అవకాశం ఉంది, శరీరంలో నీటి శాతం తగ్గితే, వడదెబ్బ తగులుతుంది, అందువల్ల వేసవిలో శరీరంలో నీటిశాతం తగ్గకుండా చూసుకోవాలి, ఎండలో తిరగటంతో రక్తకణాలు కుచించుకుపోతాయి. దీనిమూలంగా కిడ్నీలు, లివర్ దెబ్బతింటాయి. అందువల్ల కొన్ని రకాల జాగ్రత్తలు పాటించడం అవసరం. • ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తలకు క్యాప్ పెట్టుకోవాలి. గొడుగు తీసుకెళ్లాలి • రోజుకు ఐదారు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలి • సమయానికి తగిన ఆహారం తీసుకోవాలి • ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలి • వదులైన కాటన్ దుస్తులు ధరించాలి • కొబ్బరి బోండాం, మజ్జిగ తాగుతుండాలి • బయటకు వెళ్లేప్పుడు తప్పకుండా సన్‌గ్లాసెస్ పెట్టుకోవడం, నీళ్ల సీసా తీసుకెళ్లడం తప్పనిసరి. • మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో తిరగకూడదు • కీరదోస ముక్కల్ని ఎక్కువగా తినడం వల్ల శరీరానికి నీటితోపాటు పోషకాలు కూడా అందుతాయి. • శరీరంలో నీటి శాతాన్ని పెంచే పుచ్చకాయ, కొబ్బరినీళ్లు తాగాలి • వడదెబ్బ తగిలిన వ్యక్తికి ఉల్లిపాయను మెత్తగా నూరి శరీరానికి రాయాలి • జీలకర్ర దోరగా వేయించి పొడిచేయండి. అర స్పూన్ పొడిని ఒక గ్లాసు నిమ్మరసంలో కలిపి ఉప్పు, పంచదార వేసుకొని తాగితే శరీరానికి బోలెడంత ఎనర్జీ వస్తుంది • ఈ కాలంలో సలాడ్స్, తాజా కాయగూరలు, ఫ్రూట్ జ్యూస్‌లు తీసుకోవటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. • ఉడికించిన పచ్చి మామిడికాయ రసంలో ఉప్పు, జీలకర్ర కలిపి తాగుతుంటే వడదెబ్బ తగలదు.

వడదెబ్బ తగిలితే ఏం చేయాలి?

• నీరుల్లిపాయ రసం రెండు కణతలకు, ఛాతీమీద పూస్తే వడదెబ్బ నుంచి ఉపశమనం కలుగుతుంది. • వడదెబ్బ తగిలిన వారి ముఖం మీద, ఒంటి మీద నీళ్లు చల్లుతూ ఉండాలి. గ్లాసుడు నీటిలో నిమ్మరసం, చిటికడు ఉప్పు కలిపి తాగిస్తుండాలి • శరీరం మీద ఉన్న దుస్తులను వదులు చేసి విశ్రాంతిగా పడుకోనివ్వాలి • గ్లాసు నీళ్లలో స్పూను తేనె కలిపి ఇచ్చిన వడదెబ్బ నివారణ అవుతుంది • వడగళ్ళు పడినపుడు ఆ ఐస్ గడ్డలను ఏరి విభూతిలో వేసి నిలువ ఉంచి జాగ్రత్తగా దాచి ఆ విభూతిని మూడువేళ్ళకు వచ్చినంత తీసుకుని మంచినీటిలో వేసి వడదెబ్బ తగిలిన వారికి ఇస్తే వడదెబ్బ నివారణ అవుతుంది • తరువాణి తేటలో ఉప్పును చేర్చి ఇవ్వాలి • లేత తాటిముంజలను పంచదారతో కలిపి తినిపించాలి • నాలుకకు పాత ఉసిరిక పచ్చడి రాసి పుల్లని మజ్జిగ లో ఉప్పువేసి అన్నంలో పోసి పిసికి పిప్పిని పారవేసి ఆ రసాన్ని తాగించాలి • వేడి వేడి పలచటి గంజిలో ఉప్పు వేసి తాగించాలి.

ఎండవేళలో తప్పనిసరిగా బయటకు వెళ్లవలసి వస్తే, గొడుగు వాడాలి లేదా కనీసం నెత్తిన టోపీ లేదా రుమాలు పెట్టుకుని ఉంటే కొంత ఉపశమనం కలుగుతుంది.

సినిమా



• ప్రభాస్

సరికొత్త ప్రయత్నం?

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నారు. భైరవ పాత్రలో ప్రభాస్, పద్మావతి పాత్రలో దీపికా పదుకోన్, అశ్వత్థామ పాత్రలో అమితాబ్ కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. సి. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న విడుదల కావాల్సింది. అయితే వాయిదా పడే అవకాశం ఉందట. కాగా ఈ చిత్రం యూనిట్ ఓ సరికొత్త ప్రయత్నం చేస్తోందనే టాక్ ప్రచారంలోకి వచ్చింది. ఈ చిత్రంలో లీడ్ రోల్స్‌లో కనిపించే ప్రభాస్, దీపికా పదుకోన్, అమితాబ్ బచ్చన్‌ల పాత్రలకు సంబంధించిన పూర్వాపరాలను, ఆ పాత్రల తీరు తెన్నులను చెబుతూ ఓ యానిమేటెడ్ వీడియోను రెడీ చేస్తున్నారట. ఈ వీడియో నేరుగా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుందని భోగట్టా. ఈ వీడియోలోని తన పాత్రకు ప్రభాస్ ఇప్పటికే డబ్బింగ్ కూడా పూర్తి చేశారని తెలిసింది. అయితే ఈ యానిమేటెడ్ వీడియో ఏ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ఎప్పట్నుంచి స్ట్రీమింగ్ కానుంది? వీడియో నిడివి ఎంత? అసలు వార్తల్లో ఉన్నట్లు యానిమేటెడ్ వీడియో షూట్ జరిగిందా? లేదా అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.



• రష్మిక

బర్త్‌డే స్పెషల్

'పుష్ప: ది రైజ్' చిత్రంలో శ్రీవల్లి పాత్రతో నేషనల్ క్రష్‌గా మారిపోయారు రష్మికా మందన్న. ఇటు దక్షిణాదితో పాటు అటు ఉత్తరాదిలో వరుస సినిమాలు చేస్తూ ఫుల్ స్వింగ్‌లో దూసుకెళుతున్న రష్మికా మందన్న పుట్టినరోజు ఏప్రిల్ 5. ఈ సందర్భంగా ఆమె నటిస్తున్న తాజా చిత్రాలు 'పుష్ప 2: ది రూల్', 'ది గర్ల్ ఫ్రెండ్', 'రెయిన్‌బో' నుంచి బర్త్ డే స్పెషల్‌గా ఆమె కొత్త లుక్స్ విడుదల చేశారు మేకర్స్. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'పుష్ప: ది రూల్'. సుకుమార్ రైటింగ్స్ భాగస్వామ్యంతో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రష్మిక బర్త్ డే సందర్భంగా 'పుష్ప: ది రూల్'లో ఆమె పాత్ర గెటప్‌ను రివీల్ చేస్తూ పోస్టర్‌ను రిలీజ్ చేసింది యూనిట్. ఈ ఆగస్టు 15న ఈ సినిమా విడుదలవుతోంది. ఇదిలా ఉంటే.. రష్మికా మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. నటుడు రాహుల్ రవీంద్రన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. వైవిధ్యమైన ప్రేమకథతో తెరకెక్కుతున్న ఈ మూవీ 60 శాతం షూటింగ్ పూర్తయింది. అదే విధంగా రష్మిక లీడ్ రోల్‌లో నటిస్తున్న మరో చిత్రం 'రెయిన్‌బో'. శాంతరూబన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దేవ్ మోహన్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. తెలుగు–తమిళ భాషల్లో ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఈ మూవీ నుంచి కూడా రష్మిక లుక్ విడుదలైంది.

రామాయణ్‌కు సంగీతం?



• హన్స్ జిమ్మెర్, ఏఆర్ రెహమాన్

ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్స్ ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ హిందీ 'రామాయణ్'కు సంగీతం అందించనున్నారన్నది తాజా టాక్. రామాయణం ఆధారంగా దర్శకుడు నితీష్ తివారీ 'రామాయణ్' అనే ట్రయాలజీని తెరకెక్కిస్తున్నారనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ముంబైలోని ఓ స్టూడియోలో వేసిన భారీ సెట్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోందని సమాచారం. ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడి పాత్రలో యష్, కైకేయి పాత్రలో లారా దత్తా కనిపించనున్నారనే ప్రచారం జరుగుతోంది. నటీనటుల పేర్లను యూనిట్ అధికారికంగా ప్రకటించలేదు. తాజాగా 'రామాయణ్' ట్రయాలజీకి ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ సంగీతం అందించనున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. హాలీవుడ్‌లో 'ది లయన్ కింగ్' (యానిమేటెడ్) 'డ్యూన్', 'గ్లాడియేటర్', 'ఇన్సెప్షన్' వంటి హిట్ సినిమాలకు హన్స్ జిమ్మెర్ సంగీతం అందించారు. 'ది లయన్ కింగ్', 'డ్యూన్' సినిమాలకు గాను హన్స్‌కు బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో ఆస్కార్ అవార్డులు వచ్చాయి. 'స్లమ్‌డాగ్ మిలియనీర్' సినిమాకుగాను బెస్ట్ ఒరిజినల్ సాంగ్, బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో ఏఆర్ రెహమాన్‌కు ఆస్కార్ అవార్డులు వచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది. కాగా వచ్చే శ్రీరామ నవమి సందర్భంగా 'రామాయణ్' చిత్రాన్ని అధికారికంగా ప్రకటించాలనుకున్నారట మేకర్స్. మరి... ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తారా? నటీనటులు ఎవరు? అనేది ఆ రోజు తెలిసిపోతుంది. ఈ చిత్రాన్ని నమిత్ మల్హోత్రా, అల్లు అరవింద్, మధు మంతెన దాదాపు రూ. వెయ్యి కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తున్నారట.

ఏమయ్యిందే..!



• అశోక్ గల్లా

సూపర్ స్టార్ కృష్ణ మనవడు, హీరో మహేశ్‌బాబు మేనల్లుడు అశోక్ గల్లా హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. 'గుణ 369' ఫేమ్ అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో వారణాసి మానస హీరోయిన్. డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఈ చిత్రానికి కథ అందించారు. నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబిక ప్రొడక్షన్స్‌పై సోమినేని బాలకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా శుక్రవారం (ఏప్రిల్ 5) అశోక్ గల్లా బర్త్ డే. ఈ సందర్భంగా ఈ మూవీ నుంచి 'ఏమయ్యిందే..' అంటూ సాగే ఫస్ట్ సింగిల్ ప్రోమోను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. అశోక్, మానసల మధ్య వచ్చే ఈ పాట కలర్‌ఫుల్‌గా ఉంది.

• ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో అశోక్ గల్లా హీరోగా కొత్త సినిమా ప్రకటన వచ్చింది. ఈ చిత్రంతో ఉద్భవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 'లవర్', 'మ్యాడ్' చిత్రాల ఫేమ్ శ్రీ గౌరీప్రియ కథానాయికగా నటించనున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు నిర్మాతలు.

ఇక వ్యక్తిగత జీవితంపై ఫోకస్

వ్యక్తిగత జీవితానికి తాను ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చుకోవాల్సిన తరుణం వచ్చిందన్నట్లుగా మాట్లాడుతున్నారు హీరోయిన్ తాప్సీ. డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బోతో తాప్సీ వివాహం గత నెల 23న ఉదయ్‌పూర్‌లో జరిగిందనే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే తాప్సీ, మథియాస్ తమ పెళ్లి గురించి అధికారికంగా ప్రకటించలేదు. కానీ వధూవరులుగా తాప్సీ, మథియాస్ ఉన్న వీడియోలు వైరల్ అవుతుండటంతో వీరిద్దరికీ వివాహం జరిగిందని స్పష్టమైంది. కాగా పెళ్లి తర్వాత తాప్సీ ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''కొన్నేళ్లు గడిచిన తర్వాత నేను నటించిన సినిమాల జాబితాను ఓ సారి చూసుకున్నప్పుడు ఆ జాబితా నాకు సంతోషాన్నివ్వాలి. ఎందుకుంటే నా జీవితంలోని ఎక్కువ సమయాన్ని సినిమాలకే కేటాయించాను. 24 గంటల్లో నేను పన్నెండు గంటలు పని చేసిన రోజులూ ఉన్నాయి. అయితే ఇకపై నేను నా వృత్తి జీవితంపైకన్నా, వ్యక్తిగత జీవితంపై ఎక్కువ ఫోకస్ పెట్టాలనుకుంటున్నా. అందుకే ఈ సినిమా వదులుకోకూడదు అనిపించేంత మంచి స్క్రిప్ట్ అయితేనే చేయాలనుకుంటున్నాను. కెరీర్‌కి మించిన జీవితం ఒకటి ఉంటుంది. ఆ జీవితాన్ని ఆస్వాదించాలనుకుంటున్నాను. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, స్నేహితులతో సమయం గడపాలనుకుంటున్నాను'' అని చెప్పుకొచ్చారు తాప్సీ.



• మథియాస్, తాప్సీ



• తాప్సీ

బ్యాక్ టు షూట్


దాదాపు రెండు నెలల తర్వాత తిరిగి నటిగా మేకప్ వేసుకున్నారు ప్రియాంకా చోప్రా. ఇద్రిస్ ఎల్బా, జాన్ సెనా, ప్రియాంకా చోప్రా, జాక్ క్వాయిడ్, స్టీఫెన్ రూట్ ప్రధాన పాత్రధారులుగా హాలీవుడ్‌లో 'హెడ్స్ ఆఫ్ స్టేట్' అనే కామెడీ యాక్షన్ థ్రిల్లర్ మూవీ తెరకెక్కుతోంది. ఈ సినిమాకు ఇలియా నైషుల్లర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ అమెరికాలో మొదలైంది. ''..అండ్ వుయ్ ఆర్ బ్యాక్..'' అంటూ 'హెడ్స్ ఆఫ్ స్టేట్' సినిమా స్క్రిప్ట్‌ను తన ఇన్‌స్టా స్టేటస్‌లో షేర్ చేశారు ప్రియాంకా చోప్రా. దీంతో 'హెడ్స్ ఆఫ్ స్టేట్' షూట్‌లో ఆమె పాల్గొంటున్నారని స్పష్టమైంది. ఇక రెండు నెలల క్రితం తన వ్యక్తిగత పనుల కోసం ప్రియాంకా చోప్రా ఇండియా వచ్చారు. సోదరుడు సిద్ధార్థ్ చోప్రా నిశ్చితార్థం వేడుకలో చురుగ్గా పాల్గొన్నారు ప్రియాంక. ఈ వేడుకతో పాటు మరికొన్ని పనులను చక్కబెట్టుకుని ప్రియాంకా చోప్రా మళ్లీ నటిగా బిజీ అవుతున్నారు.



• ప్రియాంకా చోప్రా

స్నేహం నేపథ్యంలో...

దర్శకుడు కొరటాల శివ సమర్పణలో సత్యదేవ్ హీరోగా నటించిన చిత్రం 'కృష్ణమ్మ'. వీవీ గోపాలకృష్ణ దర్శకత్వం వహించిన ఈ మూవీలో అతీరా రాజ్, లక్ష్మణ్ మీసాల, రఘు కుంచె, నందగోపాల్ కీలక పాత్రధారులు. కృష్ణ కొమ్మాలపాటి నిర్మించిన ఈ సినిమా మే 3 రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా కృష్ణ కొమ్మాలపాటి మాట్లాడుతూ– ''రా అండ్ రస్టిక్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ మూవీగా తెరకెక్కించిన సినిమా ఇది. ఈ సినిమాతో సత్యదేవ్ మరో రేంజ్‌కి చేరుకుంటారు. కాలభైరవ అద్భుతమైన సంగీతం ఇచ్చారు'' అన్నారు. ''ఇంటెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో స్నేహం విలువను చూపిస్తున్నాం'' అన్నారు వీవీ గోపాలకృష్ణ.



• సత్యదేవ్

భవనమ్‌లో థ్రిల్

సప్తగిరి, ధనరాజ్, షకలక శంకర్, అజయ్, మాళవికా సతీషన్, స్నేహా ఉల్లాల్ ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'భవనమ్'. 'ది హాంటెడ్ హౌస్' అనేది ట్యాగ్‌లైన్. ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్ గుడ్ ఫిలిమ్స్ సమర్పణలో ఆర్‌బి చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సీర్వి నిర్మిస్తున్న ఈ చిత్రానికి బాలాచారి కూరెళ్ల దర్శకుడు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్, టీజర్‌ని విడుదల చేశారు. ''సస్పెన్స్ థ్రిల్లింగ్ హారర్‌తో పాటు కామెడీ ఎలిమెంట్స్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటుంది'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్, కెమెరా: మురళీమోహన్ రెడ్డి ఎస్.



• అజయ్